www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 9 నవంబర్ 2023

5

పశ్చిమ గోదావరి

పిఆర్-126 వరి రకం సాగు చేపట్టొద్దు

కలెక్టర్ ప్రశాంతి సూచన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

దాళ్వాలో పిఆర్-126 వరి రకం సాగు చేపట్టవద్దని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాళ్వాలో ఎక్కువ మంది రైతులు పిఆర్-126 రకం సాగుకు సన్నద్ధమవుతున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందని, ఎవరైనా రైతులు ఈ రకం సాగు చేస్తే వారు ధాన్యాన్ని ప్రయివేటుగా మాత్రమే అమ్ముకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం పిఆర్-126 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయదని స్పష్టం చేశారు. రైతులు వరినాట్లు వేసే పద్ధతి కాకుండా నేరుగా విత్తనాలు వెదజల్లే పద్ధతిని అలవాటు చేసుకోవాలని సూచించారు. రైతులు దాళ్వాసాగులో వ్యవసాయశాఖ సూచనలు పాటిస్తూ, మంచి దిగుబడులు సాధించుకోవాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు.

మార్టేరులో..

భీమవరం సభలో మాట్లాడుతున్న లోకనాథం

పాలకొల్లులో సీనియర్ నేతలకు సత్కారం

మూతపడిన పరిశ్రమలు తెరిపించాలి

ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర డిమాండ్

సహజ వనరులు ప్రజల హక్కు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

రెండో రోజు జిల్లాలో ఉత్సాహంగా సాగిన బస్సు యాత్ర

యాత్రకు అడుగడుగునా అపూర్వ ఆదరణ

బృందానికి సమస్యలు ఏకరువు..

వినతిపత్రాలు సమర్పణ

తాడేపల్లిగూడెంలో ర్యాలీలో అగ్రభాగాన నేతలు

ప్రజాశక్తి - భీమవరం/పెనుమంట్ర/తణుకు రూరల్

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర రెండో రోజు జిల్లాలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. ఈ బస్సు యాత్రకు అడుగడుగునా ఆదరణ లభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో విసుగు చెందిన ప్రజానీకం యాత్రకు ఎదురెళ్లి ఘనస్వాగతం పలికారు. మహిళలు నేతలకు తిలకం దిద్ది హారతులు పట్టి స్వాగతించారు. నరసాపురం నుంచి బుధవారం ప్రారంభమైన ఈ బస్సు యాత్ర పాలకొల్లు, మార్టేరు, తణుకు, తాడేపల్లిగూడెం మీదుగా భీమవరం వరకు సాగింది. ఈ యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.లోకనాథం, మంతెన సీతారాం నాయకత్వం వహిస్తుండగా రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు, హరిబాబు, ఆర్.శ్రీనివాసరావు, కె.ధనలక్ష్మి, ఆంద్ర మాల్యాద్రి పాల్గొన్నారు. పాలకొల్లు గాంధీబొమ్మ సెంటర్ వద్ద రాజ్యాంగ నిర్మాత, అంబేద్కర్, కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాలకు యాత్ర బృందం పూలమాల వేసి ఘన నివాళులర్పించింది. సగంచెరువు గ్రామంలో ఇళ్ల పట్టాల కోసం పోరాటం సాగిస్తున్న దళితులు, బిసిలు, సంచార జాతుల ప్రజలను బృందం సభ్యులు పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. పాలకొల్లులో జరిగిన సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, మార్టేరులో సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, తణుకులో సభకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, తాడేపల్లిగూడెంలో సభకు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నేతలు లోకనాథం, నాగేశ్వరరావు, ధనలక్ష్మి, హరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందాల్సిన జిల్లా పాలకుల నిర్లక్ష్యం కారణంగా వెనుకబడిందన్నారు. జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తక్షణం తెరిపించాలని డిమాండ్ చేశారు.

వి.ఉమామహేశ్వరరావు

తిలకం దిద్ది.. హారతులు పట్టి

నరసాపురంలో ప్రారంభమైన ప్రజారక్షణ భేరి బస్సు యాత్రకు అడుగడుగునా స్వాగతం లభించింది. తీన్మార్ డప్పులు, వాయిద్యాల నడుమ ర్యాలీగా తీసుకెళ్లారు. తణుకులో కల్లుగీత కార్మికుల యాత్ర బృందం సభ్యులు లోకనాథం, హరిబాబు, నాగేశ్వరరావు కార్మికుల మోకులు ధరించారు.

సమస్యలపై ఏకరువు.. వినతుల సమర్పణ

బస్సు యాత్రలో బృందం సభ్యులకు ప్రజానీకం సమస్యలు ఏకరువు పెట్టారు. సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. మార్టేరులో ఆశాలు, అంగన్వాడీలు, విఒఎలు, పారిశుధ్య కార్మికులు, ఆటో వర్కర్ల యూనియన్ సభ్యులు సమస్యలు విన్నవించి వినతి పత్రాలు అందజేశారు. తణుకులో పౌరహక్కుల సంఘం, స్కూల్ స్వీపర్లు, ఆర్‌పిలు, కల్లుగీత కార్మికులు, మున్సిపల్ వర్కర్స్, ఎల్ఐసి ఏజెంట్లు, మెడికల్ రిప్రజెంటేటివ్స్, ఎపి సీడ్స్ మహిళలు వినతిపత్రాలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని నేతలు వారికి హామీ ఇచ్చారు.

తణుకులో కల్లుగీత కార్మికుల్లా మోకులు ధరించిన నేతలు

పాలకొల్లు: ప్రజారక్షణభేరి బస్సు యాత్రలో సిపిఎం నేతలు స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య, బిఆర్.అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ సిపిఎం నేతలు వలవల శ్రీరామ్మూర్తి, యర్రా కృష్ణారావు, అరటకట్ల నారాయణమ్మను రాష్ట్ర నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నేతలు కె.రాజారామ్మోహన్‌రాయ్, జవ్వాది శ్రీనివాస్, బాతిరెడ్డి జార్జి, దేవ సుధాకర్, యర్రా అజయ్, టి కోటేశ్వరరావు, రాయపరాజు, కవురు పెద్దిరాజు, ఎం.త్రిమూర్తులు పాల్గొన్నారు.

తణుకు రూరల్: సిపిఎం ప్రజారక్షణ భేరి యాత్ర పట్టణానికి వచ్చిన సందర్భంగా ఘనస్వాగతం పలికారు. మున్సిపల్‌కార్యాలయం వద్ద నిర్వహించిన సభ సందర్భంగా సీనియర్ నేతలు మల్లిపూడి కృష్ణమూర్తి, గార రంగారావును ఘనంగా సత్కరించారు. వివిధ సంఘాల నేతలు, కార్మికులు, ఉద్యోగులు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డివివిఎస్.వర్మ, సంకు మనోరమ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బిజెపిని తరిమికొట్టాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు

తాడేపల్లిగూడెం: రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన మతోన్మాద బిజెపిని తరిమికొట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, నిర్బంధం తీరుపై పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సిపిఎం ప్రజారక్షణ భేరి బస్సుయాత్రకు ప్రత్తిపాడు వై జంక్షన్ వద్ద ఘనస్వాగతం పలికారు. అక్కడ నుంచి పోలీసు ఐల్యాండ్ వరకు మోటారు సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. పోలీసు ఐల్యాండ్ వద్ద నుండి ఎన్‌కె గ్రౌండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా వి.ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, మంతెన సీతారాం, రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి, ఎవి.నాగేశ్వరరావు, కొల్లాటి శ్రీనివాసరావు, ఎం.హరిబాబు, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, నేతలు చిర్ల పుల్లారెడ్డి, సిరపరపు రంగారావు, కండెల్లి సోమరాజు, పాలుపూరి సత్యనారాయణ పాల్గొన్నారు. వి.ఉమామహేశ్వరరావు, లోకనాథం మాట్లాడుతూ స్వర్ణ భారతాన్ని నిర్మిస్తానని, రైతాంగాన్ని ఆదుకుంటానని, ధరలు తగ్గిస్తానని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. పైగా మోయలేని భారాలను మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాసంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పన్నులు, కరెంటు ఛార్జీల భారాలు విపరీతంగా పెంచుతూ, ప్రజా ఉద్యమాలపై తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తోందని విమర్శించారు. ఈ విధానాలు విడనాడకపోతే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, చల్లా చంద్రరావు, సత్తి కోదండరామిరెడ్డి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కృష్ణ, గొర్రెల సతీష్‌కుమార్, మేడ్రెడ్డి రమణ, ఏపూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం ప్రయివేటుకు తాకట్టు

సిపిఎం రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు

రాష్ట్రాన్ని బిజెపి ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు తాకట్టు పెడుతుందని సిపిఎం రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు ఆరోపించారు. తణుకులో జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించేందుకు బిజెపి ప్రయత్నాలు సాగిస్తుంటే వైసిపి, టిడిపి, జనసేన మద్దతు పలుకుతున్నాయన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా చంద్రబాబు తీసుకురాలేకపోయారని, 25 మంది ఎంపీలను ఇస్తే తీసుకొస్తా అన్న జగన్ ఏం చేశారని ప్రశ్నించారు. బిజెపి పాచిపోయిన లడ్డూ అని చెప్పిన పవన్ కళ్యాణ్‌కు ఇప్పుడు ఆ లడ్డూలే రుచికరంగా ఉన్నాయని విమర్శించారు.

రాష్ట్రంలో లక్ష మంది రైతులకే రుణాలు

సిపిఎం రాష్ట్ర నాయకులు హరిబాబు

రాష్ట్రంలో వ్యవసాయ చట్టాలు బాగోలేదని, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త చట్టాలు తెస్తామని చెప్పిన జగన్ రైతుల అభివృద్ధికి నాలుగేళ్లలో ఏం చేశారని సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు విమర్శించారు. విజయనగరం పలాసలో జీడిపప్పు రైతులకు కిలో రూ.600 కూడా లభించట్లేదని, భీమవరం, విజయవాడ ప్రాంతాల్లో కిలో జీడిపప్పు రూ.రెండు వేలు అమ్ముతున్నారన్నారు. వరి రైతులకు గడ్డి కూడా దొరికే పరిస్థితి లేదన్నారు.

ప్రజా ప్రణాళిక అమలు చేయాలి

సిపిఎం రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి

ప్రజల అభివృద్ధి, రక్షణ కోసం రూపొందించిన ప్రజా ప్రణాళికను రాజకీయ పార్టీలు అమలు చేయాలని రాష్ట్ర నాయకులు కె.ధనలక్ష్మి అన్నారు. 30 అంశాలతో కూడిన అభివృద్ధి ప్రణాళికను తయారు చేశామని, అసమానతలు లేని అభివృద్ధికి సిపిఎం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. 42 ఏళ్ల ఇండస్ట్రీ అని చెబుతున్న చంద్రబాబు తన హయాంలో ఏం చేశారని ప్రశ్నించారు. ప్రస్తుతం బిజెపికి వత్తాసు పలకడం దుర్మార్గమన్నారు. 2019లో వాడవాడలా తిరిగిన జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు శఠగోపం పెట్టారన్నారు. దళితులు, ముస్లింలు, మైనారిటీలపై దాడులు చేసి సామాజిక యాత్రలు చేపట్టడం సిగ్గుచేటన్నారు.

సహజ వనరులు ప్రజల హక్కు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం

సహజ వనరులు ప్రజల హక్కు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. మార్టేరులో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మార్టేరు, పాలకొల్లు, భీమవరం ప్రాంతాల్లో సహజ వనరులు అనేకం ఉన్నాయన్నారు. పర్యాటకంగా ఈ ప్రాంతాలను ఎంతో అభివృద్ధి చేయొచ్చని చెప్పారు. విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు, రాజధాని నిర్మాణం ఇవేమీ పట్టించుకోలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేయొద్దని ఆందోళన చేపట్టి వెయ్యి రోజులు గడుస్తుందని, అమ్మడానికి, ఆపేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరని ప్రశ్నించారు. ధాన్యం, కొబ్బరి సాగు చేస్తున్న కౌలురైతులు, రైతులు కష్టాల ఊబిలో ఉన్నారని, వారికి కనీసం సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు కూడా అందించట్లేదని అన్నారు. టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో ఈ నాలుగు పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు చింతకాయల బాబూరావు, ఆకుల హరేరాం, జుత్తిగ నరసింహమూర్తి, కె.సుబ్బరాజు, వైట్ల రాణి, వెంకటేశ్వరరావు, అజయకుమారి పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి చూపి రక్షణ కల్పించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ఒకపక్క గోదావరి.. మరోపక్క గోస్తనీ.. ప్రకృతి రమణీయ పరిసరాలు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తణుకు ప్రాంతం పాలకుల విధానాలతో విలవిల్లాడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి బలరాం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తణుకులో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ మూతపడటంతో కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. పశ్చిమలో వరి ఎలాగో, తణుకులో చెరకుకు అంత ప్రాధాన్యత ఉందని, అయితే నేడు అది అంతరించిపోయిందన్నారు. రాష్ట్రానికి రోజూ కోటి గుడ్లు అందిస్తున్న తణుకు పౌల్ట్రీ పరిశ్రమలు కునరిల్లుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి మూసేసిన పరిశ్రమలు తెరవాలని, కార్మికులకు ఉపాధి కల్పించి రక్షణ కల్పించాలన్నారు.

విధానాలు మార్చుకోకపోతే బిజెపి, వైసిపిలకు గుణపాఠం తప్పదు

కేరళ తరహా విధానాలను రాష్ట్రంలో అమలు చేయాలి - సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్

భీమవరం: కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక, నిర్బంధ విధానాలు విడనాడకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్ హెచ్చరించారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో నిర్వహించిన సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షత వహించారు. తొలుత యాత్రకు అంబేద్కర్ సెంటర్లో మహిళలు కోలాటంతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో వెంకట్ మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ప్రత్యేక ప్రణాళికతో ప్రజల ముందుకొచ్చిందన్నారు. భీమవరం ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పుకోవడమే తప్ప ఆశించిన మేర అభివృద్ధి ఎక్కడుందని ప్రశ్నించారు. రైతులు, కార్మికుల పరిస్థితులు ఎలా ఉన్నాయో ఆలోచించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో వ్యవసాయం సంక్షోభంలో ఉందన్నారు. దీంతో రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికుల పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందన్నారు. రాష్ట్రంలో 32 లక్షల ఇళ్లు ఇచ్చామని గొప్పలు చెబుతున్న వైసిపి ప్రభుత్వం కేరళ వైపు చూడాలన్నారు. కేరళలో 3.90 లక్షల మందిని గుర్తించి రూ.7.40 లక్షల రుణం ఇచ్చి నిర్మించి గృహప్రవేశాలు చేయడం తగదన్నారు. మోడీ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి అధికారం కోసం అర్రులు చాస్తున్నారన్నారు.

మోడీ విధానాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని విమర్శించారు. టిడిపి, జనసేన కూడా మోడీ భజన చేస్తున్నారని చెప్పారు. వంద శాతం ధరలు పెరిగితే 26 శాతం మాత్రమే వేతనాలు పెరిగాయన్నారు. సిపిఎంకు ఒక్క ఎంఎల్ఎ లేకపోయినా సమస్యలపై నిరంతరం పోరాడతామన్నారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడగా స్థానిక నాయకులు డి.కళ్యాణి, శేషపు ఆశ్రియ్య, ఇంజేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి : సాబ్జీ

ప్రజాశక్తి - అత్తిలి

ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల నిర్మాణంలో జాప్యం తగదని, తక్షణం పనులు వేగవంతం చేయాలని ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. బుధవారం ఆయన అత్తిలి గర్ల్స్ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, బల్లిపాడు, ఆరవల్లి, మంచిలి హైస్కూళ్లలో పర్యటించారు. ఉపాధ్యాయ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గర్ల్స్ హైస్కూల్‌లో మరుగుదొడ్లకు అవుట్‌లెట్ లేక ఉన్న ఇబ్బందిని ఉపాధ్యాయులు సాబ్జీ దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డిఎ, పిఆర్‌సి, ఎపిజిఎల్ఐ తదితర బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, 117 జిఒను రద్దు చేసి స్కూల్స్ మ్యాపింగ్ ఆపాలని, జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల పట్ల ప్రవీణ్‌ప్రకాష్ వైఖరి మార్చుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉపాధ్యాయుల ఆగ్రహానికి ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని సాబ్జీ హెచ్చరించారు.

ఉపాధ్యాయులతో ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

రాష్ట్రంలో ఎస్‌సి, బిసి, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత

వైసిపి సామాజిక సాధికార యాత్రలో మంత్రి వేణుగోపాల్

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు జగన్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర బిసి శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్ చెప్పారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద వైసిపి ఆధ్వర్యాన బుధవారం సామాజిక సాధికార యాత్ర నిర్వహించారు. వర్షంలోనూ పెద్దసంఖ్యలో మహిళలు సభకు తరలొచ్చారు. ఈ సభలో శాసనమండలి ఛైర్మన్ మోసేన్ రాజు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చాక అంబేద్కర్ రాజ్యాంగం అమలు చేసింది జగన్ ప్రభుత్వమన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అవినీతి అక్రమాలతో ప్రజలను దోచుకుతిన్నాయని, సామాజిక న్యాయం చేసిన ఘనత జగన్‌దేనన్నారు. ప్రజల ముందు ధైర్యంగా అభివృద్ధి, సంక్షేమం గురించి చెప్పుకునే ఘనత తమకు దక్కిందని మంత్రి విశ్వరూప్ చెప్పారు. సభలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ, గోదావరి జిల్లాల సమన్వయకర్త మిథున్‌రెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, ఎంఎల్‌సిలు కవురు శ్రీనివాస్, ఇజ్రాయిల్, టిటిడి సభ్యులు మేకా శేషుబాబు, నేతలు గుబ్బల తమ్మయ్య, చెల్లెం ఆనంద ప్రకాష్ యడ్ల తాతాజీ గుణ్ణం నాగబాబు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర సభలో మంత్రులు, నేతలు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిరసిస్తూ

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరించే చర్యలను నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు తదితర విద్యార్థి సంఘాల పిలుపు మేరకు చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లావ్యాప్తంగా విజయవంతమైంది. ఆచంట మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలను స్వచ్ఛందంగానే మూసేశారు. భీమలాపురం అంబేద్కర్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, ఎస్‌ఎఫ్ఐ నేత కొండేటి ఈశ్వర్ మాట్లాడగా నేతలు పిల్లి చంటిబాబు, తమరాపు దుర్గాప్రసాద్, కె.జగదీష్, ఎం.శివకుమార్, సిహెచ్.చౌదరి, వి.రాము, ఎ.సాయికుమార్, వి.పవన్‌కృష్ణ, ఎ.థెరిస్సా, ఎన్.సత్యలక్ష్మి, కె.షాలిని, వి.సౌమ్య, జాహ్నవి పాల్గొన్నారు. తాడేపల్లిగూడెంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు నేత ఎం.రూపశంకర్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తే సమస్య ఉండదని, అయితే కేంద్రం ఏకపక్షంగా ప్రయివేటు వ్యక్తులకు అమ్మేయాలని ప్రయత్నించడం దారుణమని అన్నారు. ఎఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్షులు అజయ్ మాట్లాడారు. నరసాపురంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఎఫ్ఐ నేతలు ఎం.సాయికృష్ణ, ఎమ్‌డి.జాన్ మాట్లాడారు. భీమవరం మండలం వెంపలో విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. భీమవరం పట్టణంలో ప్రయివేటు, ప్రభుత్వ విద్యాసంస్థలను మూయించి ప్రకాశం చౌక్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.వాసు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి సిహెచ్.నాగరాజు మాట్లాడారు. పెనుగొండలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సాయి, కె.ఈశ్వర్‌రామ్‌కుమార్ మాట్లాడారు. గణపవరం మండలంలో ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు పూర్తిగా మూతపడ్డాయి. ఎస్‌ఎఫ్ఐ జిల్లా నాయకురాలు శాంతి మాట్లాడారు. ఆకివీడులో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి రాంబాబు మాట్లాడారు. పాలకొల్లులో బంద్ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.సుందర్, ఎస్‌ఎఫ్ఐ కె.యశ్వంత్, పి.శేఖర్ మాట్లాడారు. పెనుమంట్ర మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది.

భీమవరంలో నేతల నిరసన

మొగల్తూరులో కురుస్తున్న వర్షం

డెల్టాలో పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో బుధవారం మధ్యాహ్నం విస్తారంగా వర్షం కురిసింది. మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు, పెనుమంట్ర, పొలమూరు, ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరు, మల్లిపూడి, సోమరాజు ఇల్లింద్రపర్రుతోపాటు పలు గ్రామాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మొగల్తూరు: మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. రహదారులు జలమయమై ప్రజలు, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోడూరు: బుధవారం మధ్యాహ్నం పలుచోట్ల వర్షం కురిసింది. మండలంలో పోడూరు, పెనుమదం, కవిటం, గుమ్ములూరు, జగన్నాథపురం తదితర గ్రామాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది.

మాట్లాడుతున్న జెసి రామ్‌సుందర్‌రెడ్డి

పారదర్శకంగా స్వమిత్వ సర్వే : జెసి

ప్రజాశక్తి - భీమవరం

స్వమిత్వ సర్వే ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో స్వమిత్వ మూడో విడత సర్వే ప్రక్రియపై 24 గ్రామాలకు సంబంధించి సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, మండల యుపిఆర్‌డిలకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వమిత్వ సర్వే ప్రక్రియను స్నేహపూరిత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ప్రతిఒక్కరికీ నోటీసులు జారీ చేసి వారి సమక్షంలోనే సర్వే చేయాలన్నారు. అనుమానాలకు, వివాదాలకు తావులేకుండా ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఫిర్యాదులేవీ రాకుండా అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలన్నారు. గ్రామకంఠం సర్వేలపై అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, గ్రామకంఠం భూములు సర్వే చేసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆస్తి అనుభవిస్తున్న వారికి యాజమాన్య హక్కు పత్రాలు అందజేయాలని తెలిపారు. స్వమిత్వలో ప్రభుత్వ భూములు, ప్రయివేటు ఇంటి స్థలాలు పక్కాగా సర్వే చేయాలన్నారు. రహదారులు, డ్రెయినేజీలు, ప్రభుత్వ, ప్రయివేటు స్థలాలు, భవనాలు అన్ని కచ్చితమైన ఆధారంతో సర్వే జరపాలన్నారు. ప్రయివేటు స్థలాల సర్వే అనంతరం యజమానులకు యాజమాన్య హక్కు పత్రాలు సకాలంలో అందించాలన్నారు. ఈ సర్వే ప్రక్రియలో ఇంటి స్థల యజమానులతో సిబ్బంది స్నేహపూరిత వాతావరణంలో మెలగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జివికె.మల్లికార్జునరావు, జిల్లా సర్వే అధికారులు కె.జాషువా పాల్గొన్నారు.

రజక వృత్తిదారుల సమస్యలపై పోరాడాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రజక వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు పిలుపునిచ్చారు. రజక వృత్తిదారుల సంఘం పట్టణ కమిటీ బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో యండమూరి నాగేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మడకా రాజు మాట్లాడుతూ గడిచిన నాలుగు సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రజకులకు చేసిందేమీ లేదన్నారు. రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఛైర్మన్, డైరెక్టర్లు బోర్డు నియమించినా కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వానికి రజకుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థం అవ్వాలంటే రజక కార్పొరేషన్ చేసిన తీర్మానాలు ఆమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుత్తి చెరువులపై రజకులకే పూర్తి హక్కు ఉండాలన్నారు. దేవాలయాలు ప్రభుత్వ హాస్పిటల్స్ ఇతర డిపార్టమెంట్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలని, 50 ఏళు పూర్తయిన రజకులకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 2, 3, 4 తేదీల్లో చుక్కా అప్పలస్వామి భవనంలో జరిగే రజక చైతన్య తరగతులను జయప్రదం చేయాలని, 3న రజక గర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చైతన్య తరగతుల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి టేకు శ్రీను, ఎం.నాగేశ్వరరావు, బి.సత్యనారాయణ, టి.రాంపండు, కె.వాసు, కె.దుర్గాభవాని పాల్గొన్నారు.

వైసిపికి సామాజిక బస్సు యాత్ర చేసే అర్హత లేదు

ఎంఎల్ఎ నిమ్మల, మాజీ ఎంఎల్‌సి అంగర

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎస్‌సి, బిసి, మైనార్టీలను మోసం చేసిన వైసిపికి సామాజిక చైతన్య బస్సు యాత్ర చేసే అర్హత లేదని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్ఎ అంగర రామ్మోహన్ విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి నిర్వహిస్తున్న సామాజిక చైతన్య బస్సు యాత్ర సందర్భంగా బుధవారం ఎంఎల్ఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంఎల్ఎ రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం నాలుగున్నరేళ్లల్లో దళితుల గొంతు నొక్కి, బిసిల పీక కోసి, మైనార్టీల పొట్ట కొట్టిందన్నారు. దళితుల విదేశీ విద్యను 3 సంవత్సరాలు నిర్వీర్యం చేసిందన్నారు. మైనార్టీలను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఆయా వర్గాల ప్రజలు వచ్చే ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, రాబోయేది టిడిపి, జనసేన కూటమి అని తెలిపారు. అంగర మాట్లాడుతూ ప్రజలకు ఏం ఉద్ధరించారని సామాజిక చైతన్య యాత్ర చేస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో పెచ్చెట్టి బాబు, జివి కర్నేన గౌరునాయుడు, కోడి విజయభాస్కర్ పాల్గొన్నారు.

మావుళ్లమ్మ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో మావుళ్లమ్మ వారి నిత్యాన్నదానానికి భీమవరం గొల్లవానితిప్పకు చెందిన రాయుడు శ్రీరామ్మూర్తి రూ.లక్ష విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్, ఇఒ యర్రంశెట్టి భద్రాజీకి బుధవారం అందజేశారు. వారికి ఆలయ ముఖ్య అర్చకులు మద్దిరాల రమణశర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ అమ్మవారి ఫొటో ప్రసాదాలు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - కాళ్ల

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందని ఆక్వా సలహా మండలి జిల్లా సభ్యులు పి.దుర్గాప్రసాదరాజు అన్నారు. కలవపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆక్వా సలహా మండలి జిల్లాసభ్యులు పి.దుర్గా ప్రసాదరాజు మాట్లాడుతూ 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని గెలిపిస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ సమావేశంలో ముదుండి వెంకట నరసరాజు, టి. సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శి ఎం.అనూష, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ వేలం పాట

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో జప్తు చేసిన ఒక మోటార్ సైకిల్‌ను బుధవారం వీరవాసరం ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. హీరో హోండా ప్యాషన్ మోడల్ మోటార్ సైకిల్‌ను వేలం పెట్టగా రూ.1,7200 ఆదాయం వచ్చినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐబి సిఐ వర్మ పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి కృషి

పాలకోడేరు ఎంపిపి చంటిరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

మాట్లాడుతున్న ఎంపిపి చంటిరాజు

మండలంలోని శివారు ప్రాంతాలు, జగనన్న కాలనీల్లో రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు) అన్నారు. బుధవారం పాలకోడేరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పలు కాలనీలకు నిధులు కేటాయించామన్నారు. ఈ సమావేశంలో శృంగవృక్షంలో 20 ఏళ్ల కిందట ఏర్పడిన సిద్ధయ్య కాలనీకి ఇప్పటికే విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో సుమారు 150 కుటుంబాలు అవస్థలు పడుతున్నాయని ఎంపిటిసి సభ్యులు సత్యకృష్ణ, బల్లా భారతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిద్ధయ్య కాలనీలో పూర్తిస్థాయిలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయకపోవడాన్ని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అక్రమ లేఅవుట్లలో సొమ్ములు చెల్లిస్తే ఆఘమేఘాలపై విద్యుత్తు సౌకర్యం కల్పిస్తున్నారని, పేదలు నివసించే కాలనీకి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎలక్ట్రికల్ ఎఇని సభ్యులు నిలదీశారు. పంచాయతీ నుంచి స్తంభాల ఏర్పాటుకు సొమ్ము చెల్లిస్తే విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామని ఎఇ సమాధానం ఇచ్చారు. జగనన్న కాలనీల్లో రహదారులు ఏర్పాటు చేయాలని పలువురు సభ్యులు అధికారులను కోరారు. ఎంపిడిఒ ఎం.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా గ్రామాల వారీగా సంక్షేమ పథకాల బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని ఆయన కార్యదర్శులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి నరేష్, సర్పంచులు బొల్లా శ్రీనివాస్, జంగం సూరిబాబు, కడలి నాగేశ్వరి పాల్గొన్నారు.

సేవే నిరీక్షణరాజు లక్ష్యం

సంపాదనలో కొంత మేర సేవా కార్యక్రమాలు
కరోనా సమయంలో పేదలకు నిత్యావసరాల పంపిణీ
క్రీడాకారులకు ప్రోత్సాహం, డాక్టరేట్ అందుకున్న నిరీక్షణరాజు

పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న నిరీక్షణరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సేవే లక్ష్యంగా అతి తక్కువ కాలంలో ప్రజలకు చేరువయ్యేవారు చాలా అరుదు. అటువంటి వారిలో డి.నిరీక్షణరాజు ఒకరు. రాజకీయ నాయకులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వీరంతా సమాజంలోని ప్రజలకు తమవంతుగా ఏదో ఒక విధంగా సేవలందిస్తుంటారు. అయితే వాళ్లు ఏదో ఒక రూపంలో తాము చేసిన సేవలకు ప్రతిఫలం పొందుతుంటారు. కొందరు మాత్రం సేవే లక్ష్యంగా తమ ఉదారతను చాటుకుంటూ ప్రజలకు దగ్గరవుతారు. ఆ కోవకు చెందిన వారు నిరీక్షణరాజు.

కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన డి.నిరీక్షణరాజు స్వతహాగా మృదు స్వభావి. 15 ఏళ్లుగా ఆక్వా రంగంలో లేబర్ కాంట్రాక్టర్‌గా, వివిధ వ్యాపారాల్లో రాణిస్తూ ఉన్నత స్థితికి ఎదిగారు. తన సంపాదనలో కొంతైనా సామాజిక సేవ, ఆధ్యాత్మికకు వెచ్చించాలనే దృక్పథంతో ఆక్వా కార్మికులకు, పేదలకు తన వంతుగా సాయమందిస్తున్నారు. ఆయన ప్రచారానికి దూరంగా, ప్రజలకు దగ్గరగా ఉంటారు. సమాజానికి మేలు చేసేవారు చెప్పుకోవాల్సిన పనిలేదని, తాను చేసే సేవ కనిపిస్తే చాలని అంటారు నిరీక్షణరాజు.

సమాజసేవే ఆయన లక్ష్యం..

సమాజ సేవే లక్ష్యంగా నిరీక్షణరాజు ముందుకు సాగుతున్నారు. ఐదేళ్లుగా ఆయన చేసిన సేవా కార్యక్రమాల వల్ల ఎంతో మంది పేద కుటుంబాలు లబ్ధిపొందాయి. పది మందికి సాయపడాలన్నదే నిరీక్షణరాజు అభిలాష.

ఆపదలో అండగా..

వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన నిరీక్షణ రాజుకు సామాన్య ప్రజలు పడే కష్టాలు తెలుసు. ఈ క్రమంలోనే తన వంతు సాయంగా ప్రజలకు ఏదో విధంగా సాయపడాలన్న సదుద్దేశంతో పరులకు ఉపకారం చేస్తున్నారు. కరోనా కష్టకాలంలో ఆయన ఏమాత్రమూ భయపడలేదు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ప్రజల మధ్యే తిరుగుతూ ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచారు. వందల మంది ఆకలితీర్చడమే కాకుండా ఆర్థిక సాయం అందించారు. కరోనా మొదటి, రెండు దశల్లో ఆక్వా పరిశ్రమల్లో పనిచేసే వందల మంది కార్మికులకు రెండు లక్షల రూపాయల విలువైన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేశారు. అంతటి మనసున్న మరాజు నిరీక్షణరాజు.

అలాగే సామాజిక, విద్య, క్రీడ రంగాల్లో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం, దేశ నాయకుల జయంతి, వర్ధంతులు నిర్వహించి పేదలకు ఆర్థిక సాయం చేశారు. కరోనా సమయంలో వలస కార్మికులకు శానిటేషన్, మాస్కులు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోపల్లెలో అంబేద్కర్ జయంతి, వర్ధంతి వేడుకలు ఏటా నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు 2022లో ఘనంగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏటా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారు.

డాక్టరేట్ అందుకుంటున్న నిరీక్షణరాజు

నిరీక్షణరాజుకు డాక్టరేట్ ప్రదానం

నిరీక్షణరాజు చేస్తున్న సేవలను గుర్తించి రాజస్థాన్‌లోని సన్‌రైజ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కోపల్లె గ్రామంతో పాటు వివిధ గ్రామాల నుంచి అభిమానులు, స్నేహితులు వచ్చి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరీక్షణరాజును ఘనంగా సత్కరించారు.

నిరీక్షణరాజును సత్కరిస్తున్న సభ్యులు

వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిరీక్షణరాజు

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

రానున్న సాధారణ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లకు సన్నద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. భీమవరం నియోజవర్గానికి సంబంధించి తాత్కాలికంగా ఎన్నికల సామగ్రిని భద్రపర్చేందుకు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటుకు, శిక్షణ తరగతుల నిర్వహణకు బుధవారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలోని వివిధ బ్లాక్‌ల్లో అనువైన భవనాల పరిశీలనతోపాటు, జిల్లాలో ఎన్నికల అనంతరం ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఇవిఎంలను భద్రపర్చడానికి స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపునకు అనువైన భవనాలను విష్ణు కాలేజీ నందు దాదాపు రెండు గంటల పాటు కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్‌పి యు.రవిప్రకాష్, జిల్లా జాయింటు కలెక్టరు ఎస్.రామ్ సుందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అలాగే రెండు కళాశాలల్లోని పీజీ సెంటరు, సెమినార్ రూమ్, ఆడిటోరియంలు, విష్ణు కాలేజీ పబ్లిక్ స్కూల్, అన్నపూర్ణ క్యాంటీన్, సీతా పాలిటెక్నికల్ కళాశాలను పరిశీలించారు.అనంతరం కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. భవనాలు ఖరారు చేసిన అనంతరం నివేదికను సిద్ధం చేసి ఎన్నికల కమిషన్‌కు ఆమోదం నిమిత్తం పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, తహాశీల్దార్ వై.రవికుమార్, కళాశాల ప్రతినిధులు, డిప్యూటీ తహాశీల్దార్ సిహెచ్ విద్యాపతి పాల్గొన్నారు.

ఉండి:రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్నికల సామగ్రిని భద్రపర్చేందుకు అనువైన భవనాలను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం పరిశీలించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం, గొడౌన్లను ఎన్నికల సందర్భంగా ఉండి నియోజకవర్గానికి సంబంధించి తాత్కాలికంగా ఎన్నికల సామగ్రి భద్రపర్చేందుకు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటుకు, శిక్షణా తరగతుల నిర్వహణకు అనువైన గొడౌన్ గదులను కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం భద్రతా ఏర్పాట్లపై ఎస్‌పితో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, తహాశీల్దార్ ఏడిద శ్రీనివాస్, డిప్యూటీ తహాశీల్దార్ ఎస్‌విఎస్ నాయుడు, మండల సర్వేయరు రత్నవల్లి, ఎఎంసి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : బుధవారం స్థానిక వైఎన్ కళాశాల పిజి సెంటరు, సెమినార్ హాల్లో, ఆడిటోరియంను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి పరిశీలించారు. రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా నరసాపురం నియోజకవర్గానికి సంబంధించి తాత్కాలికంగా ఎన్నికల సామగ్రి భద్రపర్చేందుకు, డిస్ట్రిబ్యూషన్ సెంటరు ఏర్పాటుకు, శిక్షణా తరగతుల నిర్వహణకు అనువైన గదులను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి రవి ప్రకాష్, జెసి ఎస్.రామ్ సుందర్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.అచ్యుత అంబరీష్, తహాశీల్దార్ ఎస్ఎం.ఫాజిల్, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరిని విజయవంతం చేయండి

జెఎన్‌వి గోపాలన్

ప్రజాశక్తి - ఉండి

సిపిఎం ఆధ్వర్యంలో నవంబర్ 15న విజయవాడలో నిర్వహించే ప్రజారక్షణ భేరి యాత్రను విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. బుధవారం పాందువ్వలో పర్యటించిన గోపాలన్ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రక్షణగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై పన్నుల భారాలు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తూ కార్మికుల ఉపాధిని కొల్లగొడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజా రక్షణ భేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, మండల నాయకులు మాదాసి గోపి పాల్గొన్నారు.

ఆకివీడు : ఈ నెల 15న విజయవాడలో జరగనున్న సిపిఎం ప్రజా రక్షణభేరి సభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి గోపాలన్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రైస్ మిల్ కార్మికులతో గోపాలన్ మాట్లాడారు. రైస్ మిల్లు వద్ద సాధారణ సమావేశాలు నిర్వహించుకుని కార్మికులు సమైక్యంగా కదలి రావాలని ఆయన సూచించారు. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం కొరకు కార్మికులంతా ఐక్యతతో ఆందోళనలో పాల్గొనాలన్నారు.

రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపి, వైసిపిని ప్రతి ఒక్కరూ తరిమికొట్టాలని ప్రజాసంఘాల కార్యకర్తలు పిలుపునిచ్చారు. ఈనెల 15న విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరి సభలో పాల్గొనాలని కోరుతూ పట్టణంలోని మహిళల ఇంటికి వెళ్లి బొట్టు పెట్టి వారిని ఆహ్వానిస్తున్నారు. కార్యక్రమంలో ఎస్.ఉదయకుమారి, బి.కృష్ణవేణి, పి.ప్రమీల, ఎ.పద్మావతి, శాంతి పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్ సర్వీసులు

నరసాపురం టౌన్ :కార్తీకమాసం సందర్భంగా ఈ నెల 19వ తేదీ నుంచి పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్‌టిసి నరసాపురం డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్న రెడ్డి తెలిపారు. ఈనెల 19, 26, వచ్చే నెల 3, 10, తేదీల్లో నరసాపురం, భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం డిపోల నుంచి ప్రత్యేక బస్సులు రాత్రి 9 గంటలకు బయలుదేరుతాయని తెలిపారు. టికెట్ ధర రూ.700, రూ.800, రూ.900, రూ.1100గా నిర్ణయించినట్లు తెలిపారు. విహార యాత్రలకు అద్దె ప్రాతిపదిక మీద బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

జగన్‌వి కక్షపూరిత రాజకీయాలు : ఎంఎల్ఎ

ఉండి:రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఎంఎల్ఎ మంతెన రామరాజు విమర్శించారు. ఎస్ఆర్ పి.అగ్రహారంలో బుధవారం ఎంఎల్ఎ మంతెన రామరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ బాబు, బాబుతో నేను, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తూ రాష్ట్ర అభివృద్ధిని పాతాళంలోకి తొక్కేశారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, దూసనపూడి రాంబాబు, కిన్నెర వెంకన్న, బురిడి రవిబాబు పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబు నాయుడుతోనే అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుందని టిడిపి మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అన్నారు. మొగల్తూరులోని పితాని వారి పాలెంలో బుధవారం సాయంత్రం బాబుతో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కత్తిమండ ముత్యాలరావు, బల్ల శ్రీను, బస్వాని ఏడుకొండలు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో మంత్రి రజిని

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మావుళ్లమ్మను ఆరోగ్య శాఖా మంత్రి విడుదల రజిని బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల రమణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఇఒ యర్రంశెట్టి శెట్టిభద్రాజీ మంత్రిని సత్కరించారు. అమ్మవారి ప్రతిమతో పాటు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేటి నుంచి 'ఆంధ్రాకు జగనే ఎందుకు'

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 9 నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ జ్యోతి బుధవారం తెలిపారు. పది రోజుల పాటు సచివాలయాల పరిధిలో నిర్వహించే ఈ కార్యక్రమం 9న నందమూరుగరువు, 10, 14, 23న వీరవాసరం, 15న తోకలపూడి, 16న చింతలకోటిగరువు, 17న నవుడూరు, 20న వడ్డిగూడెం, 21న కొణితివాడ, 22న బాలేపల్లిలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పథకాలు, అభివృద్ధిపై లబ్ధిదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి పథకాల సమాచార బోర్డుల ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ మండలంలో షెడ్యూల్ ప్రకారం సంక్షేమ పథకాల సమాచార బోర్డుల ఆవిష్కరణ కార్యక్రమం గ్రామ సచివాలయాల వారీగా జరుగుతుందని ఎంపిడిఒ పి.పద్మజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథ రాజు, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ, జెడ్‌పిటిసి కర్రి గౌరి సుభాషిణి, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు, ఇతర ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

ఖాళీగా అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి ఈ నెల 16వ తేదీలోపు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.కృష్ణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచంటలో వంకటాల చెరువులో అంగన్‌వాడీ కార్యకర్త, పెనుమంట్ర మండలం మాముడూరులోని బొక్కవారిపాలెం, మలపర్రులో -3, సిద్ధాంతం-8లో, ములపర్రులో- 4, గరువు, ఆచంట స్టువర్టుపురం, మహిళా మండలి ఆచంట వేమవరంలో ఒక్కోటి చొప్పున అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

MAILA KUMARA SWAMY అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.28-02-2014న L7635778 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.2-11-2023న మా ఇంటి నుండి నరసాపురం పట్టణం, మెయిన్‌రోడ్‌కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతు న్నాను.

MAILA KUMARA SWAMY
S/o. MAILA VENKATESWARLU
D.No. 1-123, Pedamainavani Lanka
Thurputallu Post, Narasapuram (M)
West Godavari Dist, A.P.

మహారాజశ్రీ స్పెషల్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో

C.C. No. 853/2020

Between:
Matta Satish ...*Complainant*
AND
Pydimukkala Jithendra Veera Venkata Naidu ...*Accused*

నిందితుడి హాజరు నిమిత్తం సెక్షన్ 82 CRCPC ప్రకారం వేయించిన ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, పై నెంబరు గ్రంధము నందు ముద్దాయి పైడిముక్కల జితేంద్ర వీర వెంకటనాయుడు, S/o. వీరవెంకట సత్యనారాయణమూర్తి, హిందూ, పురుషుడు, వయస్సు 28, బిజినెస్, డో.నెం. 12-12-7/1, LIC by AP, H.B.Colony, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా వారికి ఎన్.బి.డబ్ల్యూ. వారెంటు జారీ కాబడి పై నెంబరు కేసులో U/S 138 of NI Act క్రింద కేసు నెంబరు CC No. 853/2020 లో నేరానికి పాల్పడినట్లు (లేదా నేరానికి పాల్పడినట్లు అనుసరించినారని) శ్రీ కోర్టు వారి ఎదుట ఫిర్యాదు చేయబడినది. సదరు కేసు నందు మీకు సమను అమలు కాబడి తరువాత మీరు పరారిలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై శ్రీ కోర్టు వారి ఎదుట ది. **11-12-2023వ తేదీలో కోర్టు వారి ఎదుట హాజరు కావలెను.** లేనియెడల పోలీసు వారి ద్వారా NBW లు అమలు పరచబడును అని తెలియజేయడమైనది.

ఎన్.హరీష్‌నాయుడు
తణుకు ఫిర్యాదు తరుపు అడ్వకేట్
09-11-23 తణుకు, సెల్:9293222187

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎస్ఆర్‌కెఆర్‌లో 'అన్వేషి' చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి భీమవరం రూరల్

అన్వేషి చిత్ర బృందం బుధవారం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో సందడి చేసింది. హీరో విజయ్‌తో పాటు హీరోయిన్లు చిత్ర బృందంలోని నటీనటులందరూ కళాశాలకు విచ్చేశారు. విద్యార్థులతో ఆడుతూ పాడుతూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అన్వేషి చిత్రంలో ముఖ్యమైన సన్నివేశాలు, పాటల్లోని కొన్ని భాగాలు ప్రమోషన్‌లో భాగంగా ప్రదర్శించారు. విద్యార్థులు కేరింతలు కొట్టేలా చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత, దర్శకులు నట బృందం మాట్లాడుతూ ఈ నెల 17న రాష్ట్రంలోని అన్ని థియేటర్లలో చిత్రం విడుదలవుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ చిత్రం చూసి ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాలకు విచ్చేసిన చిత్ర బృందానికి స్వాగతం పలికారు. గతంలో నాలుగైదు చిత్రాలు తమ కళాశాలలో ప్రమోషన్ వర్క్ చేయగా అవన్నీ మంచి విజయాన్ని అందుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో దర్శక నిర్మాతలు టి.గణపతి రెడ్డి, విజె.కన్నా పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామికి రూ.7.88 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక గునుపూడిలోని సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానం హుండీ ఆదాయం 154 రోజులకు గాను రూ.7,88,128 వచ్చినట్లు ఆలయ రామకృష్ణంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ ధర్మకర్తలతో పాటు యాత్రికులు పురోహితులు పాల్గొన్నారు.

సర్పంచి మునేంద్రరావుపై కేసును ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - వీరవాసరం

నవుడూరు గ్రామ ఉప సర్పంచి బొట్టా మునేంద్రరావుపై గ్రామ సర్పంచి నల్లమల్లి వేనుక పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని వైసిపి మాజీ మండల కన్వీనర్, ఎస్‌సి సంఘం నాయకులు నేతల జ్ఞాన సుందరరాజు కోరారు. నౌడూరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ బోర్డు సమావేశంలో ఉప సర్పంచి బొట్టా మునీంద్ర అవమానించారంటూ గ్రామ సర్పంచి నల్లమల్లి వేణుక చేసిన ఫిర్యాదు వాస్తవం కాదని బోర్డు సభ్యులంతా ఏకగ్రీవంగా తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఎస్‌సి, బిసి వర్గాలు సోదర భావంతో ఉంటున్న ఇటువంటి తరుణంలో వర్గ విభేదాలు సృష్టిస్తూ ఎస్‌సి, ఎస్‌టి కేసులు పెట్టడం సమంజసం కాదని తెలిపారు. సర్పంచి నల్లమల్లి వేనుక తక్షణం స్పందించి తాను ఇచ్చిన ఎస్‌సి, ఎస్‌టి కేసును తిరిగి వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే సామరస్య పూర్వక వాతావరణంలో చర్చించుకోవాలని హితవు పలికారు. అక్రమ కేసులు తొలగించాలంటూ గ్రామస్తులు సైతం పెద్ద ఎత్తున ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సమావేశంలో జెసిఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్ కుమార్, వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు, గడ్డం భాస్కరరావు, బొంతు రమేష్, తదితర ఎస్‌సి నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

వైసిపి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి పెద్ద పేట వేసి ముందుకు సాగుతోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. మోగల్లు పంచాయతీ పరిధిలోని గుత్తులవారి పాలెంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.18 లక్షలతో ఒహెచ్ఆర్ నిర్మాణానికి డిసిసిబి ఛైర్మన్ బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం విస్సాకోడేరులో రూ.20 లక్షలతో నిర్మించనున్న ఐదు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంతోషం వ్యక్తం చేస్తూ స్థానికులు పివిఎల్‌ను, ఎంపిపి భూపతి రాజు సత్యనారాయణ రాజును, సర్పంచి బొల్ల శ్రీనివాసును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి నాగరాజు, ఎంపిటిసి బి.గాంధీ పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 249-256/General/2023-24, Dated. 06-11-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Construction of CC Road, BT Road, Drains, Construction of Shop Rooms, Balance Work at Ward Sachivalayam, Supply and Delivery of CCMS Boxes and Automatic Waste Processing Plant in Municipal Corporation, Eluru"** Total No of works is **8** with an amount of Rs. **94.75** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 09-11-2023. Last date of receipt of tenders is 15-11-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU